జడ్పీల పేర్లు మారేదెప్పుడు?

జిల్లా ప్రజాపరిషత్ ఆఫీసు

- ముగిసిన హనుమకొండ, వరంగల్ జడ్పీల పాలకవర్గం గడువు
- నాలుగు నెలలైనా నిర్ణయం తీసుకోని సర్కారు
- స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం
- రిజర్వేషన్ మారే అవకాశం?

హనుమకొండ, నవంబర్ 3: వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల జిల్లా ప్రజాపరిషత్‌ల పేర్లు ఎప్పుడు మార్పు చేస్తారని ఆయా జిల్లాల వాసులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత పాలక వర్గం గడువు ముగిసి నాలుగు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకవర్గం గడువు ముగియగానే వరంగల్ అర్బన్ జిల్లా ప్రజాపరిషత్‌ను హనుమకొండ జడ్పీగా, వరంగల్ రూరల్ జిల్లాను వరంగల్ జడ్పీగా మార్పు తథ్యమని భావించిన ప్రజలకు నిరాశే ఎదురైందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పోటీ చేయాలనుకొనే వారు సందిగ్ధంలో పడిపోయారు. జడ్పీల పేర్లు మారితే తప్ప ఎవరు ఎక్కడ పోటీ చేయాలనే స్పష్టత వస్తుందనే ప్రచారం ఉంది. అయితే గత ప్రభుత్వం మాత్రం హనుమకొండ, వరంగల్ జిల్లా ప్రజాపరిషత్‌లుగా మార్పు చేయాలని జీవో సైతం జారీ చేసిందని పంచాయతీరాజ్ అధికారులు పేర్కొంటున్నారు.

2021లోనే హనుమకొండ, వరంగల్ జిల్లాలుగా..

గత ప్రభుత్వం 2021లోనే వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జడ్పీలను హనుమకొండ, వరంగల్ జిల్లా ప్రజాపరిషత్‌లుగా మార్పు చేస్తూ జీవో నంబర్ 74ను జారీ చేసింది. అయితే అప్పటికి జడ్పీ పాలకవర్గం గడువు ముగియకపోవడంతో యథాతథంగా కొనసాగించారు. కాగా జీవో వెలువడే వరకు హనుమకొండ జిల్లాలో 9 మండలాలు ఉండగా వరంగల్ అర్బన్ జడ్పీ పరిధిలో భీమదేవరపల్లి, ధర్మసాగర్, ఎల్కతుర్తి, హసన్‌పర్తి, ఐనవోలు, కమలాపూర్, వేలేరు ఏడు మండలాలు ఉన్నాయి, అలాగే వరంగల్ జిల్లాలో 18 మండలాలు ఉండగా, రూరల్ జడ్పీ పరిధిలో 16 మండలాలు ఉండేవి. పాలక వర్గం గడువు ముగిసిన తర్వాత రూరల్ జడ్పీ పరిధిలోని ఆత్మకూరు, దామెర, శాయంపేట, పరకాల, నడికూడ ఐదు మండలాలను హనుమ కొండ జడ్పీలో కలుపుతూ మార్పు చేయాలని ప్రతిపాదనలు పంపించినట్లు పంచాయతీరాజ్ అధికారులు తెలిపారు. రాష్ట్ర సర్కారు దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదు. వరంగల్ అర్బన్, రూరల్ జిల్లా ప్రజాపరిషత్‌లుగా కొనసాగుతుండడంతో రాష్ట్రం నుంచి వచ్చే నిధులు, పథకాల అమలు, కలెక్టర్ల సమీక్ష లాంటి అంశాల్లో విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవడంలో అభ్యంతరాలు, ఆటంకాలు ఏర్పడుతున్నాయని జడ్పీ ఉద్యోగులు అంటున్నారు.

ప్రభుత్వ నిర్ణయంతోనే రిజర్వేషన్

వరంగల్ అర్బన్ జడ్పీ ఎస్సీ జనరల్, వరంగల్ రూరల్ జడ్పీ జనరల్ మహిళగా రిజర్వేషన్ కొనసాగుతున్నది. హనుమకొండ జడ్పీలోకి వరంగల్ రూరల్ జిల్లాలోని ఐదు మండలాలు చేర్చినపుడు పాపులేషన్ పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో రిజర్వేషన్ ప్రక్రియ మారే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. మొత్తానికి ప్రభుత్వం తీసుకొనే నిర్ణయంతోనే రిజర్వేషన్ ఉంటుందనే వాదన వినిపిస్తున్నది. ఒక వైపు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు సమయాత్తం అవుతుండగా, వీటికి ముందే హనుమకొండ జడ్పీ, వరంగల్ జడ్పీలుగా మారిస్తే ఇబ్బందులు ఉండవని ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే కొత్తగా ఏర్పాటైన మండలాల్లో ప్రాదేశిక నియోజక వర్గాల ఏర్పాటు, రిజర్వేషన్ల ఖరారు, పోలింగ్ బూత్‌ల గుర్తింపు, ఓటరు జాబితా తయారీ, మెటిరీయల్ సేకరణ లాంటి ఏర్పాట్లపై ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందంటున్నారు. ఈ విషయంలో రెండు జిల్లాలకు చెందిన ప్రజా ప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

స్వర్ణపతకం, మెమెంటో అందుకుంటున్న శ్రావణ్

ఫొటోగ్రఫీలో శ్రావణ్‌కు స్వర్ణ పతకం

శ్రావణ్‌కు బహుమతి లభించిన ఫొటో

వెంకటాపూర్, నవంబర్ 3: ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామంలోని తడండ్ల శ్రావణ్‌కు ఫొటోగ్రఫీలో స్వర్ణపతకంతోపాటు నగదు బహుమతి లభించింది. ప్రపంచ ఫొటో జర్నలిజం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియా ఇంటర్నేషనల్ ఫొటో గ్రాఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయ వాడలోని బాలోత్సవ్ వన్లో శనివారం రాత్రి నిర్వహించిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే మన్మథరావు, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు చేతుల మీదుగా ఎంఏ రహీం మెమెరియల్ అవార్డు అందుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది ఫొటోగ్రాఫర్లు పాల్గొనగా తెలుగు పండుగల కేటగిరీలో అవార్డుతో పాటు నగదు లభించింది. ఖైరాతాబాద్ మహా గణపతి శోభాయాత్రపై తీసిన ఫొటోకు ఉత్తమ అవార్డు లభించిందని, అవార్డు రావడం సంతోషంగా ఉందని శ్రావణ్ అన్నారు. కాగా శ్రావణ్‌ను ఫొటోగ్రాఫర్లు, గ్రామస్తులు అభినందించారు.

ధాన్యం దిగుమతికి మిల్లర్ల అనాసక్తత

తమ డిమాండ్లను పరిగణలోకి తీసుకోవాలని కలెక్టర్‌కు లేఖ

ములుగు, నవంబర్ 3(నమస్తేతెలంగాణ): ధాన్యం సేకరణలో తమ ఇబ్బందులు, కష్టనష్టాలను గుర్తించాలని, పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని ములుగు జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో మిల్లర్లు శనివారం కలెక్టర్‌కు లేఖ అందజేశారు. 2024-25 వానకాలం ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్లకు ఎన్నో సవాళ్లు ఎదురవుతున్నాయన్నారు. సన్నధాన్యం తేమశాతం గతంలో మాదిరిగా 17శాతం కాకుండా 14శాతం ఉన్నప్పుడు మాత్రమే మిల్లింగ్ చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. లేనిపక్షంలో ధాన్యం మొత్తం రంగు మారి సీఎంఆర్‌కు పనికి రాకుండా పోతుందన్నారు. గతంలో మాదిరిగా 67కేజీల బియ్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వలేమని, దీనికి సంబంధించి తరుగుదలకు స్పెషల్ ఇన్‌సెంటివ్ క్వింటా బియ్యానికి రూ.200 ఇస్తేనే దిగుమతి చేసుకుంటామని తెలిపారు. పాత గన్నీ సంచు లను మాత్రమే వాడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రైస్ మిల్లర్స్‌కు రావాల్సిన పాత బకాయి, డ్రైఏజ్, కస్టోడియన్ చార్జెస్ చెల్లించాలని, లేని పక్షంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పాత గన్నీ ధరను మార్కెట్ ధర ప్రకారం రూ.12 నిర్ణయించాలన్నారు. జీవో నంబర్ 21లో రైస్ మిల్లులో సార్టెక్స్ మిషన్ తప్పనిసరి ఉన్నందున విద్యుత్ సరఫరాను 180హెచ్‌పీకి పెంచినప్పుడు మాత్రమే సార్టెక్స్ మిషన్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. సీఎంఆర్‌కు సంబంధించి తాము ఎలాంటి బ్యాంకు గ్యారెంటీని ఇవ్వలేమని పేర్కొన్నారు. ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం ఉన్నందున ఈ విషయంలో ములుగు జిల్లాకు తప్పని సరిగా మినహాయింపు ఇచ్చేలా చూడాలని అన్నారు.

వికటించిన వైద్యం

- ఎంజీఎం దవాఖానలో మహిళకు చికిత్స
- గర్భ విచ్ఛిత్తి కోసం ఆర్‌ఎంపీని సంప్రదించిన మహిళ
- మాత్రలు వికటించడంతో ఆస్పత్రిపాలు

వివరాలు తెలుసుకుంటున్న మెడికల్ కౌన్సిల్ సభ్యులు

వరంగల్‌చౌరస్తా, నవంబర్ 3: వైద్యం వికటించి అపస్మారకస్థితికి చేరుకున్న మహిళను ఎంజీఎం దవాఖానలో చేర్పించారు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లాకు చెందిన మహిళ అక్టోబర్ మూడో వారంలో గర్భవిచ్ఛిత్తి కోసం మంగపేట ప్రాంతానికి చెందిన ఆర్‌ఎంపీ రామును సంప్రదించింది. వైద్య పరీక్షలు చేసిన అతడు నాలుగు నెలల గర్భంగా నిర్ధారించాడు. అనంతరం గర్భవిచ్ఛిత్తి కోసం మాత్రలు అందించాడు. వాటిని వినియోగించిన మహిళకు కడుపు నొప్పి వచ్చింది. ఈ విషయం తెలియజేయడంతో ఆర్‌ఎంపీ నొప్పిని తగ్గించేందుకు మరిన్ని మాత్రలు ఇచ్చాడు. దీంతో ఆమె తాత్కాలిక ఉపశమనం పొందింది. మళ్లీ కడుపులో నొప్పి రావడంతో ఈ నెల 1న హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి గర్భాశయం విచ్ఛిన్నం కావడంతోపాటు రక్తం విషతుల్యంగా మారినట్లు వైద్యులు గుర్తించారు. వెంటనే హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి హాస్పిటల్‌కు ఆమెను తరలించి గర్భాశయాన్ని తొలగించారు. అప్పటికే పరిస్థితి విషమంగానే ఉండడంతో ఎంజీఎం దవాఖానకు తరలించి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నారు. విషయం తెలుసుకున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ పబ్లిక్ రిలేషన్ కమిటీ విభాగం చైర్మన్ డాక్టర్ నరేశ్‌కుమార్ బాధితురాలి నుంచి సమాచారం సేకరించారు. ములుగు జిల్లా వైద్యాధికారితోపాటు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయనున్నట్లు కౌన్సిల్ సభ్యులు తెలిపారు.

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

కృష్ణకాలనీ/ ఖిలావరంగల్, నవంబర్ 3 : అనారోగ్యంతో జీవితం మీద విరక్తి చెంది ఓ రిటైర్డ్ ఉద్యోగి రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వరంగల్ రైల్వేస్టేషన్ యార్డులో జరిగింది. వరంగల్ జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ పీ రాజు తెలిపిన కథనం ప్రకారం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా జవహర్‌నగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి కుసుమ కాంతయ్య (74) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స చేయించుకున్నా భుజం, నరాల సమస్య తగ్గకపోవడంతో జీవితంపై విరక్తి చెంది వరంగల్ రైల్వేస్టేషన్ యార్డ్‌కు చేరుకొని తిరుపతి నుంచి సికింద్రాబాద్ వెళ్లే ప్రత్యేక రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన మొబైల్ ఫోన్ ఆధారంగా కుటుంబ సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం దవాఖాన మార్చూరికి తరలించినట్లు తెలిపారు.

పీఏసీఎస్‌లో రూ.14లక్షల దుర్వినియోగం

చైర్మన్, సీఈవో, ఏడుగురు డైరెక్టర్లపై చర్యలకు రంగం సిద్ధం

శాయంపేట : శాయంపేట పీఏసీఎస్ ఇదే

శాయంపేట, నవంబర్ 3 : శాయంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నిధులు భారీగా దుర్వినియోగమయ్యాయి. సంఘం చైర్మన్, సీఈవోతో పాటు ఏడుగురు డైరెక్టర్లు అక్రమాలకు పాల్పడినట్లు ఆడిట్‌తో తేలింది. రూ.14.44 లక్షల రికవరీ చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. శాయంపేట పీఏసీఎస్‌లో అక్రమాలు జరుగుతున్నట్లు మొదటి నుంచి పలువురు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో నోడల్ అధికారి, సబ్ రిజిస్ట్రార్ విజయభాస్కర్‌రెడ్డి తుది ఆడిట్‌లో అవకతవకలు జరిగినట్లు నివేదికను అందించారు. సొసైటీలో తాత్కాలిక సిబ్బంది ఇద్దరికి వేతనాలుగా రూ.1.30లక్షలను చెల్లించి సొసైటీ నిధులను దుర్వినియోగం చేశారని, చైర్మన్ కుసుమ శరత్, సీఈవో గుర్రం రాజమోహన్ నుంచి రికవరీ చేయాలని నివేదిక ఇచ్చారు. 2019-20 రబీ సీజన్‌లో జోగంపల్లి, మైలారం, నేరేడుపల్లి, వసంతాపూర్, తహరాపూర్, గట్లకానిపర్తిలో చైర్మన్,సీఈవో ధాన్యం సేకరించారు. ఆరు సెంటర్లలో రూ. 3.14 లక్షల ఖర్చు చూపారు. అయితే ఇందులో రూ.1.24లక్షలు దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. 2020-21 ఖరీఫ్‌లో ఏడుగురు డైరెక్టర్లు ధాన్యం సేకరణ కేంద్రాలను నిర్వహించారు. ఏడు సెంటర్లలో రూ.6.54లక్షలు ఖర్చు జరిగింది. అయితే ఇందులో రూ.3.70లక్షలు రికవరీకి నిర్ణయించారు. 2020-21 రబీ, 2021-22 ఖరీఫ్ సీజన్‌లో చైర్మన్, సీఈవో ఆరు సెంటర్లలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. ఇందులో రూ.5.50లక్షలు దుర్వినియోగం అయినట్లు నిర్ధారించారు. తహరాపూర్‌లో ధాన్యం సేకరణ చేపడితే కమీషన్‌గా వచ్చింది రూ.16,715.. కానీ ఇక్కడ ఖర్చును మాత్రం రూ.73,300 చూపడంతో అధికారులే విస్తుపోతున్న పరిస్థితి నెలకొంది. 2020-21రబీలో లారీల వెయిటింగ్‌చార్జెస్ కింద రూ.1.42లక్షలను చైర్మన్ చెల్లించినట్లు చూపడంతో రికవరీకి నిర్ణయించారు. మొత్తంగా రూ.14,44,721లు నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. దీనికి 12 శాతం వడ్డీతో కలిపి రికవరీ చేయాలని డీసీవో నీరజ ఆదేశించారు. అయితే రుణమాఫీలో వడ్డీని అధికంగా చూపడంతో సీఈవో రాజమోహన్‌ను ఇప్పటికే సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో చైర్మన్, సీఈవో, ఏడుగురు డైరెక్టర్లకు నోటీసులు ఇచ్చారు. తప్పు జరిగినట్లు తేలితే చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

రాబడి

గోల్డ్ Vs నిఫ్టీ 50

పదేండ్ల క్రితం పెట్టిన పెట్టుబడిపై ఎందులో ఎంత రాబడి?

మనలో చాలామంది బంగారం కొంటే లాభమా?.. స్టాక్ మార్కెట్లలో మదుపు చేస్తే లాభమా?.. అన్న దైలమాలో ఉంటారు. అయితే భౌతిక బంగారం, ఈక్విటీలు రెండూ దీర్ఘకాల పెట్టుబడి సాధనాలే. కనుక ఈ రెండింటిపై పెట్టే పెట్టుబడులను స్వల్పకాలానికి ఏది లాభమన్నది తేల్చలేం. కాబట్టి పదేండ్ల క్రితం అటు బంగారంపై, ఇటు నిఫ్టీ 50లో రూ.10 లక్షల చొప్పున పెట్టుబడి పెడితే ఇప్పుడు మదుపరికి ఎంత? రావచ్చన్నది ఒక్కసారి చూద్దాం. అంతకంటేముందు బంగారం పట్ల భారతీయుల వైఖరి, స్టాక్ మార్కెట్ల చరిత్రను పరిశీలిద్దాం.

బంగారం

- మన దేశంలో భౌతిక బంగారానికి సహజ స్వరూపం నగలే.
- భారతీయులు బంగారాన్ని తమ ప్రతిష్టకు, సంపదకు ప్రతిరూపంగా భావిస్తారు.
- ఇటీవల సురక్షిత పెట్టుబడి సాధనంగా కూడా పరిగణిస్తున్నారు.
- ఆభరణాలు, నాణేలు, కడ్డీలు, బిస్కట్ల రూపంలో పుత్తడిని కొంటున్నారు.
- ఇంట్లో శుభకార్యాలతోపాటు దీపావళి తదితర పండుగలు, అక్షయ తృతీయ, ధనత్రయోదశి రోజుల్లో ఎక్కువగా కొనుగోళ్లు.
- జ్యుయెల్లర్స్, బ్యాంకులు, వ్యాపారుల ద్వారా జరుగుతున్న పసిడి లావాదేవీలు.
- నగల రూపంలో బంగారం కొన్నప్పుడు అందులో తయారీ, తరుగు చార్జీలుంటాయి. తిరిగి అమ్మినప్పుడు వాటిని మినహాయించి చెల్లించడం జరుగుతుంది.
- పసిడి అమ్మకాల ద్వారా ఆదాయం పొందినప్పుడు స్వల్ప లేదా దీర్ఘకాల మూలధన లాభాల పన్నును చెల్లించాల్సి ఉంటుంది.
- బంగారం అనేది ఎంతో విలువైన లోహం. అపహరణకు వీలెక్కువ. అందుకే భద్రంగా నిల్వ చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది.

నిఫ్టీ 50

- ఎన్ఎస్ఈ నిఫ్టీ అనేది.. భారత్‌లోని రెండు ప్రధాన స్టాక్ మార్కెట్ సూచీల్లో ఒకటి. మరొకటి బీఎస్ఈ సెన్సెక్స్.
- 1996 ఏప్రిల్ 21న నిఫ్టీ 50 మొదలైంది. బ్యాంకింగ్, ఐటీ, మెటల్స్, ఫార్మా వంటి 12 రంగాలకు చెందిన టాప్ 50 కంపెనీలు ఇందులో నమోదై ట్రేడ్ అవుతూ ఉంటాయి.
- నిఫ్టీ 50లోని కంపెనీల మూలాలు బలమైనవి. వాటి వ్యాపారాలు పెద్ద ఎత్తున సాగుతాయి. కాబట్టే దేశంలోని అత్యంత స్థిరమైన సూచీల్లో నిఫ్టీ కూడా ఒకటిగా ఉంటున్నది.
- నిజానికి ఎన్ఎస్ఈలో నిఫ్టీ 50 అనేది ప్రధాన ఇండెక్స్. దీంతోపాటు నిఫ్టీ నెక్స్ట్ 50, నిఫ్టీ ఐటీ, నిఫ్టీ బ్యాంక్ సూచీలూ ఉన్నాయి.

ఇదీ సంగతి..

- 2014లో బంగారంపై సురేశ్ రూ.10 లక్షల పెట్టుబడి పెట్టారు. ఈ పదేండ్లలో పసిడి ధరల్లో వార్షిక వృద్ధిరేటు 12.18 శాతంగా నమోదైంది. అంటే 2014 అక్టోబర్‌లో 24 క్యారెట్ 10 గ్రాములు (తులం) రూ.25,500గా ఉన్నది. ఇప్పుడు రూ.82,400. దీన్నిబట్టి రూ.10 లక్షల పెట్టుబడి విలువ కాస్తా దాదాపు రూ.31,55,294.12కు చేరుతుంది.

- ఇక పదేండ్ల క్రితమే నిఫ్టీ 50 షేర్లలోనూ రూ.10 లక్షల పెట్టుబడిని సురేశ్ పెట్టారు. 2014 అక్టోబర్‌లో నిఫ్టీ 50 ఉన్న స్థాయితో పోల్చితే ఇప్పుడున్న స్థాయి 11.31 శాతం ఎక్కువ. దీన్నిబట్టి సదరు రూ.10 లక్షల పెట్టుబడి రూ.29,19,971.16 కోట్లకు చేరుతుంది. దాదాపు రెండూ ఒకే స్థాయిలో రాబడులను పంచుతున్నాయి. అయితే బంగారం ధరల్లో హెచ్చుతగ్గులున్నట్టే.. స్టాక్ మార్కెట్ల లోనూ ఒడిదొడుకులు సహజం.

భద్రం.. బీకేర్‌ఫుల్ బ్రదర్

ఆర్థిక క్రమశిక్షణ లేకపోతే అంతే సంగతి..

ప్రతీ ఒక్కరికీ ఆర్థిక క్రమశిక్షణ చాలా అవసరం. అయితే అది లేక కొందరు, అది ఉన్నప్పటికీ అవగాహన లేక తప్పుడు నిర్ణయాలు తీసుకొని మరికొందరు పెద్ద ఎత్తున మూల్యం చెల్లించుకుంటున్నారు. మరి నిపుణులేమంటున్నారో చూద్దాం.

అవగాహనతో..

ప్రతీదానిపై అవగాహన ఉంటేనే లాభమైనా.. విజయమైనా దక్కుతుంది. ముఖ్యంగా ఎలాంటి అవగాహన లేకుండా, విచారణ చేయకుండా తొందరపడి నేరుగా స్టాక్స్‌లో పెట్టుబడులు పెట్టడం నష్టాలకు దారితీయవచ్చు. స్టాక్ మార్కెట్లపై విశ్లేషణ చేసి, పూర్తిగా రిసెర్చ్ చేశాకే ఓ నిర్ణయానికి రావడం ఉత్తమం. ఈక్విటీ మార్కెట్లపై అవగాహనను పెంచుకోవడానికి అసలు సమయమే లేని చిన్న మదుపరులు ఈ పెట్టుబడులకు దూరంగా ఉండటమే లాభదాయకం. అయితే మ్యూచువల్ ఫండ్స్ ద్వారా స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులకు దిగడం ఒకింత తెలివైన పనే నని నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ మీకొచ్చే ఆదాయం మార్కెట్ ఒడుదొడుకులకు లోబడే ఉంటుందన్నది మరువద్దు. మొత్తానికి ఎక్స్‌పర్ట్స్ సలహాలతో ముందుకెళ్తేనే ప్రయోజనం.

అతితో అనర్థాలే..

కొందరు ఏం చేసినా అపరిమిత స్థాయిలోనే ఉంటుంది. ఈ క్రమంలోనే విపరీతంగా స్టాక్స్‌ను కొంటూంటారు. అలాగే ఫండ్స్‌నూ అదేస్థాయిలో రకరకాల పెట్టుబడి సాధనాల్లోకి మళ్లిస్తూ ఉంటారు. అయితే వైవిధ్యం అనేది వ్యూహమే అయినా.. ఒక మోతాదు దాటితే దుష్పరిణామాలకే దారితీస్తుంది. ఓ సర్వే ప్రకారం మీ పోర్ట్‌ఫోలియోలో వివిధ రంగాల నుంచి 15-20 శాతం స్టాక్స్.. మీకున్న రిస్క్‌ను తగ్గిస్తుంది. ఇంతకు మించితే ఎటువంటి లాభమూ దక్కదు. కాబట్టి స్టాక్స్ కొనుగోలు, నిధుల మళ్లింపుల్లో అతి పనికిరాదు.

బీమాను మరువద్దు

ప్రతీది పన్ను కోణంలో చూడవద్దు. పెట్టుబడులైనా, బీమా అయినా పన్ను మినహాయింపులను దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవద్దు. ముఖ్యంగా బీమా పాలసీల విషయంలో ఈ రకమైన ఆలోచన శ్రేయస్కరం కాదు. ఎందుకంటే పన్ను మినహాయింపుల కోసం బీమా పాలసీలను తీసుకుంటే.. కావాల్సిన ప్రయోజనాలను మీరు కోల్పోవాల్సి వస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనకు అవసరమైన బీమాలో భాగంగానే పన్ను ప్రయోజనాలు దక్కలిగానీ.. మొత్తం పాలసీనే నిరుపయోగంగా మార్చవద్దని హితవు పలుకుతున్నారు. అలాగే సమగ్రరీతిలో కవరేజీ ఉన్న పాలసీలనే తీసుకోవాలని సూచిస్తున్నారు. ఒకటికి మించి బీమా పాలసీలుంటే మంచిదే అయినప్పటికీ.. మీమీ ఆర్థిక అనుకూలతలనూ పరిగణనలోకి తీసుకుని నిర్ణయం తీసుకోవడం ఉత్తమం.

రుణ భారం

అవసరమున్నా, లేకున్నా నేడు చాలా మంది మితిమీరిన రుణ భారాన్ని తలకెత్తుకుంటున్నారు. బ్యాంకింగ్, నాన్-బ్యాంకింగ్ సంస్థల నుంచి వస్తున్న ఆఫర్లతో కొందరు.. క్రెడిట్ కార్డు సంస్థల నుంచి వస్తున్న ప్రకటనలతో మరికొందరు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దీనివల్ల జీవితంలో రాజీపడి బ్రతకాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. కాబట్టి అప్పుచేసి పప్పుకూడు ఎప్పటికీ మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఆదాయ-వ్యయాల మధ్య అంతరాలను తెలుసుకొని జీవించాలంటున్నారు. అనవసరపు కోర్కెలను తీర్చుకోవడానికి చేసే అప్పులు.. ముమ్ముందు గృహ రుణం వంటి కీలక లక్ష్యాల సాధనను ఆంటకపర్చే వీలుకూడా లేకపోలేదు. కాబట్టి అప్పుల విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

చివరగా..

ప్రతి ఒక్కరూ తమ ఆర్థిక స్థోమతను తెలుసుకొని ప్రవర్తించాలి. ప్రధానంగా ఇటీవలి కాలంలో అన్ని రంగాల్లో స్థిరత్వం లోపించింది. ఉద్యోగాలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అందుకే కనీసం 6 నెలల అవసరాలు తీరేలా అత్యవసర నిధి ఉండాలి. సురక్షితమైన పెట్టుబడులకు పెద్దపీట వేస్తూనే.. పొదుపునకూ ప్రాధాన్యత ఇవ్వాలి. వీలుంటే రుణ భారాన్ని తగ్గించుకోవాలి. అవసరం మేరకే ఖర్చులుండాలి. విస్తృత శ్రేణి ఆరోగ్య, జీవిత బీమా పాలసీలను తీసుకోండి. అడ్డగోలు రాబడులనిచ్చే మోసపూరిత స్కీములకు దూరంగా ఉండండి. తొందరపాటుతో కాకుండా ఓ ప్రణాళికతో ముందుకెళ్తే విజయాలు సొంతమవుతాయి.

పొదుపుతోనే రక్ష

పొదుపును ఎప్పుడూ అశ్రద్ధ చేయవద్దు. ప్రతీ వ్యక్తికి ఉండాల్సిన ఆర్థిక క్రమశిక్షణలో తెలివైన పెట్టుబడులకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో.. పొందికైన పొదుపునకూ అంతే స్థానం ఉంటుంది. యుక్త వయస్సు నుంచే సేవింగ్స్‌ను అలవాటు చేసుకుంటే ఆకర్షణీయ లాభాలను పొందవచ్చు. ముఖ్యంగా అనుకోని ఖర్చులను తేలిగ్గా అధిగమించవచ్చు. ఇక నేటి యువతలో చాలామందికి కెరియర్ ప్రారంభంలోనే మంచి ఉద్యోగాలు, పెద్ద జీతాలు దక్కుతున్నాయి. అయితే క్రెడిట్ కార్డులు, ఖరీదైన మొబైల్ ఫోన్లు.. ఇలా లైఫ్‌ను ఎంజాయ్ చేయడంపైనే దృష్టి పెడుతున్నారు. కానీ అత్యవసర పరిస్థితుల కోసం సేవింగ్స్‌పై మాత్రం మొగ్గు చూపడం లేదు. కనుక పొదుపుపై నిర్లక్ష్య ధోరణి వీడాలి.

కొత్తగా.. కొనుగోళ్ల దిశగా!

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లలో కొత్త ఏడాది (సంవత్ 2081) మొదలైంది. గత శుక్రవారం జరిగిన మూరత్ ట్రేడింగ్‌లో నూతన సంవత్సరానికి మదుపరులు లాభాలతోనే స్వాగతం పలికారు. అప్పటిదాకా నష్టాల్లో కొట్టుమిట్టాడుతున్న సూచీలు.. ఈ ప్రత్యేక ట్రేడింగ్‌తో లాభాలను సంతరించుకున్నాయి. ఫలితంగానే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 321.83 పాయింట్లు పెరిగి 79,724.12 వద్ద నిలిచింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 123.55 పాయింట్లు అందుకుని 24,304.35 దగ్గర స్థిరపడింది. ఈ క్రమంలో ఈ వారం ఇన్వెస్టర్లు పెట్టుబడులకే మొగ్గుతారన్న అంచనాలైతే వస్తున్నాయి. బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాల షేర్లపై ఫోకస్‌కు ఛాన్స్ ఉన్నది. అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 23,700 స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 24,600-24,800 మధ్యకు వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టేముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

పకడ్బందీగా పాస్‌వర్డ్

ఆర్థిక మోసాలకు చెక్ పెట్టండిలా



పాస్‌వర్డ్‌లు అనేవి ఎంతో కీలకం. ముఖ్యంగా ఆర్థికపరమైన లావాదేవీల్లో వీటి ప్రాధాన్యత చాలా ఎక్కువ. అలాంటి ఈ పాస్‌వర్డ్‌ల విషయంలో ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా భారీ నష్టాలు తప్పవు. అందుకే పా